## క్లుప్తంగా

### మజ్జిగ పంపిణీ



పెనుగంచిప్రోలు: గ్రామంలోని శ్రీతిరుపతమ్మ ఆలయంలో వేసవి తీవ్రత దృష్ట్యా ఆదివారం భక్తులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం పెదగార్లపాడు గ్రామానికి చెందిన కె.వెంకటరెడ్డి, లత దంపతుల సౌజన్యంతో ఏర్పాటు చేశారని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, ఏఈఓ కొండలరావు, ఉమాపతి, పాలకవర్గ సభ్యులు కోలా రామారావు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

### తిరుపతమ్మ సన్నిధిలో భక్తుల సందడి



పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ సన్నిధిలో భక్తుల సందడి అధికంగా కనిపించింది. ఆదివారం, పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయ క్యూ లైన్లు, పరిసరాలు కిక్కిరిసి కనిపించాయి. వేకువ జామునుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తెలంగాణ నుంచి కూడా వందల సంఖ్యల వాహనాల్లో భక్తులు తరలి వచ్చారు. సాయంత్రం వరకు రద్దీ కొనసాగింది.

### ఆలయానికి విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలోని తిరుపతమ్మకు ఆదివారం వినోదరాయునిపాలెం గ్రామానికి చెందిన చలువాది సత్యనారాయణ, అంజనీ కుమారి దంపతులు రూ.16,116 విరాళాన్ని ఆలయ ఇన్‌స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్‌కు అందజేశారు. ఆలయ అభివృద్ధికి వినియోగించాలని వారు కోరారు. ఆలయ అధికారులు దాతలకు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు.

### ఉచిత వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉచిత వైద్యసేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకర జీవనం సాగించాలని కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి సూచించారు. స్థానిక మధురానగర్ రమాదేవి నగరపాలక సంస్థ పాఠశాలలో ఆదివారం మాతృ దినోత్సవం సందర్భంగా బీఆర్టీఎస్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన ఉచిత వైద్యశిబిరం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జిల్లా వాకర్స్ క్లబ్ గవర్నర్ డీవీఎస్ రామలింగరాజుతో కలిసి ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. రామలింగరాజు మాట్లాడుతూ నడకతో అనారోగ్య సమస్యలు దరిచేరవన్నారు. అనంతరం 400 మందికి డాక్టర్ గౌతమ్ కృష్ణ, డాక్టర్ సుకీర్తి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పి.కృష్ణవేణి, కె.కొండలరావు, సుధాకర్, బీఆర్టీఎస్ వాకర్స్‌క్లబ్ నాయకులు పాల్గొన్నారు.

### గాయత్రి సొసైటీ సేవలు అభినందనీయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్క బ్రాహ్మణ విద్యార్థికి ఉపనయనం అత్యంత కీలకమైందని, అటువంటి ఉపనయనాలను ఏటా ఉచితంగా నిర్వహిస్తున్న గాయత్రి సొసైటీ సేవలు అభినందనీయమని ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్థానిక సత్యనారాయణపురం గాయత్రి కల్యాణ మండపంలో ఆదివారం శ్రీ గాయత్రి సొసైటీ ఆధ్వర్యాన ఉచిత సామూహిక ఉపనయనం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఉపనయనం చేసుకున్న చిన్నారులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గాయత్రి సొసైటీ ఏర్పడిన నాటి నుంచి ఉపనయనాలతో పాటు పేద బ్రాహ్మణులకు చేదోడు వాదోడుగా ఉంటుందని కొనియాడారు. బ్రాహ్మణులకు అండగా ఉంటామని వారికి అవసరమైన సేవలు అందించేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలిపారు.

రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ ఆస్థాన సిద్ధాంతి బ్రహ్మశ్రీ కప్పగంతు సుబ్బరామ సోమయాజులు ఉపనయన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రత్యక్ష పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బరామ సోమయాజులను ఎమ్మెల్యే విష్ణు ఘనంగా సన్మానించారు. అనంతరం వటువులను ఆశీర్వదించి వారికి పంచపాత్ర, ఉద్ధరిణె, అరివేణం అందజేశారు.

# భజే బ్రహ్మతేజం..



నందిగామ పట్టణ శివారు కే కంద్రిక వద్ద దాసాంజనేయుడిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు



విప్ ఉదయభాను నివాసంలో హనుమజ్జయంతి పూజల్లో ఉదయభాను దంపతులు



కొణకంచి క్రాస్‌రోడ్స్‌లో అభయాంజనేయుడు



డాంగేనగర్‌లోని శ్రీపంచముఖ శ్రీబాలాంజనేయస్వామి ఆలయంలో..



జయంతిపురం క్రాస్‌రోడ్డులో శ్రీప్రసన్నాంజనేయస్వామి



హనుమాన్ చాలీసా పఠనంచేస్తున్న భక్త బృందం



బలుసుపాడు గురుధాంలో హనుమత్ హోమం

**నందిగామ, జగ్గయ్యపేటలో ఘనంగా హనుమజ్జయంతి**

నందిగామ: భజే రుద్రరూపం.. భజే బ్రహ్మతేజం అంటూ ఆంజనేయస్వామిని భక్తులు మనసారా కొలిచారు. హనుమజ్జయంతి వేడుకలు ఆదివారం నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో ఘనంగా జరిగాయి. పట్టణ శివారు కె. కంద్రికలో స్వయంభు దాసాంజనేయస్వామి విగ్రహం వద్ద వేకువ జాము నుంచే పూజలు ప్రారంభమయ్యాయి. స్వామివారిని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు దర్శించుకున్నారు. పట్టణంలోని గాంధీనగర్, చందమామపేటల్లోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయాల్లో, కూరగాయల మార్కెట్‌లోని సీతారామాంజనేయ స్వామి వారి ఆలయంలో ఆకు పూజలు చేశారు. వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. పల్లగిరి గుట్టపై ఉన్న ఆంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదానాలు జరిగాయి. అనాసాగరం, హనుమంతుపాలెం, మండలంలోని అడవిరావులపాడు, చందాపురం, కొండూరు, గోళ్లమూడి, రామిరెడ్డిపల్లి, రాఘవాపురం గ్రామాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి.

**చందర్లపాడు మండలంలో..**

మండల కేంద్రమైన చందర్లపాడుతో పాటు పలు గ్రామాల్లో ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

**వత్సవాయి:** మంగొల్లు, మక్కపేట, భీమవరం, గోపినేనిపాలెం, వత్సవాయి, చిట్టేల, కంభంపాడు, పోలంపల్లి, దబ్బాకుపల్లిలో హనుమాన్ ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మక్కపేటలోని అయ్యప్ప ఆలయం వద్ద ఉన్న హనుమాన్ విగ్రహానికి అభిషేకాలు చేయగా తూర్పుబజార్‌లో హనుమాన్ యూత్ ఆధ్వర్యాన అన్నదానం చేశారు.

**జగ్గయ్యపేట అర్బన్:** సత్యనారాయణపురంలోని ఆనందసాయి ఆలయం, శ్రీదాసాంజనేయస్వామి ఆలయం, శ్రీరాంబంటు ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులు గండికోట శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో, చెరువుకట్టమీద ఉన్న శ్రీఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులు ముడుంభా వరదాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి లక్షమల్లెలు, తమలపాకులు, తులసితో పూజలు, క్షీరాభిషేకాలు నిర్వహించారు. డాంగేనగర్‌లోని శ్రీపంచముఖ శ్రీబాలాంజనేయస్వామి ఆలయం, శాంతినగర్‌లోని శ్రీచింతామణి అభయాంజనేయస్వామి ఆలయం, జయంతిపురం క్రాస్‌రోడ్డులోని శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో, పట్టణంలోని సిద్ధిలింగేశ్వరస్వామి ఆలయంలో ఉన్న శ్రీసంజీవని ఆంజనేయస్వామికి, పాలేటి తీరాన ఉన్న వరద ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

**కంచికచర్ల:** మండలంలోని పరిటాల ఆంజనేయ స్వామి ఆలయంలో భజన భక్త బృంద సభ్యులు స్వామి వారి పాటలు పాడుతూ, హనుమాన్ చాలీసా పఠనం చేశారు. మధ్యాహ్నం 5వేల మంది భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నసమారాధన చేశారు. కంచికచర్లలో పాత శివాలయంలో భక్తులు స్వామి వారికి విశేష పూజలు జరిగాయి.

**పెనుగంచిప్రోలు:** పెనుగంచిప్రోలు డౌన్ సెంటర్‌లోని ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

**బలుసుపాడు(జగ్గయ్యపేట):** గురుధాం ఆశ్రమంలో హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించారు. ఆంజనేయుడికి పంచామృతాభిషేకం, ఆకుపూజ, విశేష అర్చనలతో పాటు హనుమత్ హోమం, పూర్ణాహుతి, శ్రీరామ పట్టాభిషేక కార్యక్రమాలను తాత్వికుడు గెంటేల వెంకట రమణ దంపతులు నిర్వహించారు. అనంతరం ఆయన భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తూ వినయం, విధేయత హనుమంతుని శుభ లక్షణాలని.. ఎవరైతే ఆదరణతో ఎదుటి వారిని దైవంగా భావించి జీవిస్తారో వారికి హనుమంతుని అనుగ్రహం కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో శివానంద ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

**జగ్గయ్యపేటలో..**

పట్టణంలోని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను నివాసంలో హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతునికి ప్రత్యేక పూజలను ఉదయభాను దంపతులు నిర్వహించారు.

## గ్రామాల్లో దాడులకు పాల్పడటం బాధాకరం



శీలం భాస్కర్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీఅరుణకుమార్

నందిగామ టౌన్: ప్రశాంతతకు మారుపేరుగా ఉండే గ్రామాల్లో ఘర్షణలు, దాడులు జరగటం బాధాకరమని ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణ కుమార్ అన్నారు. వీరులపాడు మండలం బోడవాడలో టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడి నందిగామ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడు శీలం ఉదయభాస్కర్‌రెడ్డి, రాయల అనురాధలను ఆదివారం వారు పరామర్శించారు. ముందుగా గ్రామంలో జరిగిన దాడి ఘటన వివరాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు, అరుణకుమార్ మాట్లాడుతూ పార్టీలు, రాజకీయాలు ఎన్నికల సమయం వరకే పరిమితం కావాలి కానీ వాటిని దృష్టిలో పెట్టుకుని దాడులకు పాల్పడటం మంచి పద్ధతి కాదన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎవరు ఏ పార్టీలో అయినా ఉండవచ్చని ఒక పార్టీ నుంచి మరొక పార్టీకి సానుభూతిపరులుగా మారారని కక్ష పెంచుకుని దాడులకు పాల్పడటం దుర్మార్గ చర్యని తెలిపారు. ఇటువంటి ఘటనలు ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అనంతరం మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పార్టీ వీరులపాడు మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, వ్యవసాయాభివృద్ధి సంస్థ డైరెక్టర్ మంగునూరు కొండారెడ్డి తదితరులు పరామర్శించారు.

## వేసవి శిబిరాలను వినియోగించుకోండి



వత్సవాయి గ్రంథాలయంలో విద్యార్థుల తాడాట



అనిగండ్లపాడులో శిక్షణ శిబిరంలో విద్యార్థులు

కంచికచర్ల: వేసవి విజ్ఞాన శిబిరాలను వినియోగించుకోవాలని శాఖా గ్రంథాలయ గ్రంథ పాలకుడు అల్లూరు రామచంద్రుడు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ఆదివారం విద్యార్థులకు పలు విభాగాల్లో ఆటల పోటీలు నిర్వహించారు. తొలుత మాతృదినోత్సవం సందర్భంగా విద్యార్థుల తల్లులకు వందనాలు చేశారు. ముఖ్యఅతిథి తెలుగు పండిట్ షేక్ ఇస్మాయిల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత సర్వేశ్వరరావు, జల్లి కారల్ మార్క్స్ తదితరులు పాల్గొన్నారు.

వత్సవాయి : వత్సవాయిలోని గ్రేడ్–3 గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా సాగుతుంది. ఆదివారం బాలికలకు తాడాట, బాలురకు స్టోరీ రైటింగ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు: విద్యార్థుల్లో సృజన వెలికి తీయడానికి వేసవి శిక్షణ శిబిరాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు గ్రంథాలయాధికారులు ఇంజం మధు, మధుబాబు అన్నారు. ఆదివారం గ్రంథాలయాల్లో విద్యార్థులతో కథలు చదివించడం, నీతి వాక్యాలు చెప్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు.

## నేడు స్పందన

నందిగామ: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం జరిగే స్పందనలో జిల్లా జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ పాల్గొంటారని ఆర్డీఓ రవీంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 నుంచి స్పందన కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

కంచికచర్ల : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి స్పందన కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ శంకరబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.



ఆదివారం సాయంత్రం నిర్మానుష్యంగా కనిపిస్తున్న నందిగామలోని ప్రధాన వీధి

## మండుతున్న ఎండ

మండుటెండకు తోడు వడగాల్పులు కూడా ప్రారంభమయ్యాయి. ఆదివారం నందిగామలో భానుడు మరింత మండిపడ్డాడు. పగటి ఉష్ణోగ్రతలు 42.8 డిగ్రీలు నమోదవ్వగా రాత్రి ఉష్ణోగ్రతలు సైతం 27.9 డిగ్రీలు నమోదయ్యాయి. ఈ ఏడాది ఇప్పటివరకు నందిగామ లో అత్యధిక పగటి ఉష్ణోగ్రత ఇదేనని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ప్రజలకు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే నందిగామలోని పలు ప్రధాన వీధులు సాయంత్రం వేళ కూడా నిర్మానుష్యంగా కనిపించాయి. మరికొద్ది రోజులు వడగాల్పులు ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. అవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచిస్తున్నారు.

– నందిగామ

## పదకవిత.. సామాజిక చైతన్య గీతిక



విజయవాడకల్చరల్: పదకవిత సామాజిక చైతన్యగీతిక అని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. తెలుగు కళావాహిని, పోలవరపు కోటేశ్వరరావు సాహితీ సమితి, శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై ఆదివారం పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుడు 615వ జయంతి అన్నమయ్య స్వరార్చన, అంతర్జాతీయ మాతృదినోత్సవం, సాంస్కృతిక కళాసంస్థల ఐక్యవేదిక నిర్వాహకుడు నూకవరపు ప్రసాదరావు ద్వితీయ వర్ధంతి సభను నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ అన్నమయ్య సంకీర్తనల్లో అద్భుతమైన తెలుగు పదాలు కనిపిస్తాయని నేడు కొన్ని కనుమరుగైపోయాయన్నారు. ఎస్ఆర్ఆర్ కళాశాల తెలుగు అధ్యాపకుడు డాక్టర్ శేషుకుమార్ మాట్లాడుతూ.. కనిపించే ప్రత్యక్ష దైవమని అమ్మ అని, సేవానికి త్యాగానికి చిరునామా అమ్మ అని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా ట్రెజరీ ఆఫీసర్ రెహమాన్, జి.నారాయణరావు, శింగంశెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు. రాజ్యలక్ష్మి, మీనాకుమారి, వడ్డాది సూర్యకామేశ్వరి, దుర్గానాగమణి, మల్లాది స్వాతి, డేవిడ్‌రాజు, శివశంకర్, జగన్‌మోహనరావు అన్నమయ్య కీర్తనలతో పాటు పలు చిత్రగీతాలను ఆలపించారు. గాయకులను మాతృదినోత్సవం సందర్భంగా నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. వివిధ సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

## పాత శివాలయంలో శ్రమదానం



శమదానం చేస్తున్న ప్రణవ పీఠం సభ్యులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): గుంటూరుకు చెందిన ప్రణవ పీఠం సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని వన్‌టౌన్‌లోని శివాలయంలో పరిశుభ్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రణవ పీఠం ఆధ్వర్యంలో గత కొన్నేళ్లుగా జరుగుతున్న మన గుడి, బడి కార్యక్రమంలో భాగంగా ఆలయ ప్రాంగణమంతా శుభ్రపరిచి కడిగారు. పిచ్చి మొక్కలు తొలగించి, ధ్వజస్తంభం దగ్గర నుంచి మెట్ల వరకు ప్రతి ఒక్క భాగాన్ని తుడిచి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ప్రణవ పీఠం సభ్యురాలు భాగ్యశ్రీ మాట్లాడుతూ.. హిందూ ధర్మాన్ని కాపాడుకునేందుకు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ప్రతి ఆదివారం ఒక ఆలయాన్ని ఎంచుకుని శుభ్రపరచడంతో పాటు పేద ప్రజల కోసం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

## వ్యవసాయం, సహకారం.. రెండు కళ్లు

**కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు**



మాట్లాడుతున్న కేడీసీసీబీ చైర్మన్ నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: వ్యవసాయం, సహకార రంగం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. సహకార రంగాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఆదివారం స్థానిక కోదాడ రోడ్డులో ఉన్న ది జగ్గయ్యపేట గోపాలకృష్ణ విశాల సహకార పరపతి సంఘం స్థలంలో రూ 2.45 కోట్లతో నిర్మించనున్న సొసైటీ భవనం, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనుల శంకుస్థాపన జరిగింది. అనంతరం ది గోపాలకృష్ణ సొసైటీ చైర్‌పర్సన్ కోలపల్లి వెంకటేశ్వరరావు(బుల్లిబాబు)అధ్యక్షతన జరిగిన సభలో తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతు–వ్యవసాయం బాగుంటే ఊరు, రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయం, రైతు సంక్షేమానికి పెద్ద పీట వేశారన్నారు. 1958 లో ప్రారంభమైన గోపాలకృష్ణ సొసైటీ చైర్మన్‌గా సామినేని విశ్వనాథం 32 ఏళ్లు పని చేసి సొసైటీ అభివృద్ధికి పునాదులు వేశారన్నారు. ఆ తర్వాత ప్రస్తుత ఎమ్మెల్యేగా ఉన్న సామినేని ఉదయభాను 2 సార్లు చైర్మన్‌గా చేసి సొసైటీ అభివృద్ధికి కృషిచేశారని తెలిపారు. ఆ తర్వాత 18 ఏళ్లుగా బుల్లిబాబు చైర్మన్‌గా ఉంటున్నారని, రైతులకు జవాబుదారీగా ఉంటూ సొసైటీని లాభాల బాటలో పయనించేలా చేశారని తెలిపారు. నాడు రూ.80 లక్షలు ఉన్న టర్నోవర్ నేడు రూ.4.50 కోట్లతో 5 రెట్లు పెరగడం అభినందనీయమన్నారు. ఎకరం స్థలంలో ఉన్న ప్రస్తుతం భవనం, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి నాబార్డు నిధులు రూ 1.30 కోట్లు, సొసైటీ సొంత నిధులు రూ 1.15 కోట్లు కలిపి మొత్తం రూ 2.45 కోట్లతో నిర్మాణం చేపట్టారన్నారు. అందుకు ఎమ్మెల్యే ఉదయభాను సహకారం ఎనలేనిదన్నారు.

**అన్ని సొసైటీలు అభివృద్ధి పథంలో..**

తాను కేడీసీసీ బ్యాంక్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రాష్ట్రంలోనే కేడీసీసీ బ్యాంక్‌లకు ప్రత్యేక స్థానం తీసుకువచ్చానన్నారు. నియోజకవర్గంలో ఉన్న 30 సొసైటీలు లాభాల బాటలో పయనిస్తున్నాయన్నారు. మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, ఏఎంసీ వైస్ మానేపల్లి బ్రహ్మం, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్, వార్డు కౌన్సిలర్ పందుల రోశయ్య, కృష్ణా ఫార్మర్స్ సొసైటీ అధ్యక్షుడు చలమల శ్రీనివాసరావు, మంగొల్లు సొసైటీ అధ్యక్షుడు సామినేని లక్ష్మీనారాయణ, మక్కపేట సొసైటీ అధ్యక్షుడు రామారావు, గోపాలకృష్ణ సొసైటీ వైస్ పర్సన్ షేక్ బాజానీ తదితరులు పాల్గొన్నారు,

## ఎస్పీఎఫ్ సిబ్బందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు ప్రభుత్వ ముద్రణాలయంలో స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బందికి రెండు రోజుల ఉచిత వైద్యశిబిరం ఆదివారం ముగిసింది. పాలసీ బజార్ హెల్త్ ఇన్సూరెన్స్, శ్రీకర హాస్పిటల్, ఐ ఫోకస్ హాస్పిటల్ ఆధ్వర్యాన ఎస్పీఎఫ్ డీఐజీ బి.వి.రామిరెడ్డి ఆదేశాల మేరకు సిబ్బందికి శని, ఆదివారం ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండెంట్ డాక్టర్ కేఎస్ రావు మాట్లాడుతూ సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశామన్నారు. అసిస్టెంట్ కమాండెంట్ వీవీఎస్ఎన్ మల్లికార్జునరావు మాట్లాడుతూ సిబ్బంది విధి నిర్వహణతో పాటు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయటం పట్ల అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం 304 మందికి ఉచిత వైద్యపరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు ఫణికుమార్, హారిక, సతీష్, నాగవరపు శరత్ చంద్ పాల్గొన్నారు.

## అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): హైదరాబాద్‌కు చెందిన శ్రీదేవి సంగీత నృత్యనికేతన్‌కు చెందిన పలువురు నృత్యకారుల కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకుంది. ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని కళావేదికపై ఆదివారం సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం నృత్య ప్రదర్శన సాగింది. 14 మంది నృత్యకారులు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు.